## ఆర్టీసీ బస్సు ఢీకొని కూలీ మృతి.. హయత్‌నగర్‌లో విషాదం.

**దశ, హయత్‌నగర్ :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సూర్యనగర్ కాలనీకి చెందిన చౌడబోయిన ఆదినారాయణ (35)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదినారాయణ ఆటోనగర్‌లో ఇసుక పనులు ముగించుకుని తన స్ప్లెండర్ ప్లస్ (TS07GW2704) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, కనకదుర్గ బార్ అండ్ రెస్టారెంట్ దాటిన అనంతరం సర్వీస్ రోడ్డుపై వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు (TS04Z0260) ఢీకొట్టింది. బస్సును డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఆదినారాయణ రోడ్డుపై పడిపోగా, బస్సు వెనుక చక్రాలు ఆయన తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పుణ్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

## రామన్ పాడు లో మొక్కల పంపిణీ



**దశ, వనపర్తి :** మదనాపూర్ మండల పరిధిలోని రామన్పాడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హోమ్ సీడ్ ప్లాంటేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది సర్పంచ్ ఆఫ్రిన్ బేగం అంజాద్ అలీ గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. గ్రామస్తులు ప్రతి ఒక్కరు వివిధ రకాల పండ్ల మరియు పూల, ఔషధ గుణాల మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచుకోవడం వల్ల ప్రయోజకరమైన విధానాలు ఉంటాయని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధా, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ యాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ నుసూరత్ బేగం, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్సెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలకు డిమాండ్

❖ *నేడు రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు*




**దశ ఓయూ:** ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జులై 14న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో బంద్ నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) ప్రకటించింది. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థలన్నీ ఈ బంద్‌లో పాల్గొని విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని ఏబీవీపీ పిలుపునిచ్చింది.

## 'ఫెస్టివోగ్'లో తారల సందడి



**దశ, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10లో 'ఫెస్టివోగ్' భారతీయ లగ్జరీ చేనేత, కౌట్యూర్ ను సినీ తారలు శ్రియ శరణ్, మంచు లక్ష్మి, నవదీప్ కలిసి ప్రారంభించారు. అమెరికాలో దాదాపు పదేళ్లుగా భారతీయుల విశ్వాసాన్ని పొందిన ప్రీమియం లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ ఫెస్టివోగ్. అమెరికా వెలుపల ప్రారంభమైన తొలి స్టోర్ ఇదే కావడం విశేషం. అరుదైన చేనేత వస్త్రాలు, పెళ్లి వేడుకల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బ్రైడల్ కలెక్షన్లు, కౌట్యూర్ దుస్తులను హైదరాబాద్ ఫ్యాషన్ ప్రియులకు అందుబాటులోకి తెచ్చారు. అమెరికాలోని డల్లాస్‌లో ఫెస్టివోగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్ దేశంలోని అతిపెద్ద భారతీయ బ్రైడల్ బుటిక్‌లలో ఒకటిగా పేరొందింది. సంస్థ వ్యవస్థాపకురాలు భావనా ధనేకుల, భాగస్వామి సింధు కొనరాజు మాట్లాడుతూ.., భారత్‌లో తొలి స్టోర్‌కు హైదరాబాద్‌ను ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయాన్ని, ఆధునికతను సమన్వయం చేసుకున్న హైదరాబాద్ నగరంలో ప్రత్యేక చేనేత, నాణ్యమైన కళాత్మక దుస్తులకు విశేష ఆదరణ ఉందని, అందుకే తొలి భారతీయ స్టోర్‌ను ఇక్కడ ప్రారంభించినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఈ స్టోర్‌తో ఫెస్టివోగ్ భారతీయ లగ్జరీ ఫ్యాషన్ రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని, ప్రత్యేకమైన వేడుకల కోసం అరుదైన, విలాసవంతమైన వస్త్రాలను కోరుకునే వారికి ఇది ప్రీమియం గమ్యస్థానంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ హెల్ప్ డిస్క్



**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు పరిధిలోని అంబేద్కర్ భవనం దగ్గర 24,25 పోలింగ్ బూత్ బి.ఎల్.వో లు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) హెల్ప్ డిస్క్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు. ప్రజలు కూడా బీఎల్ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొప్పుల జ్యోతి బిఎల్వోలు కొలుగూరి సరస్వతి, కొయ్యడ లక్ష్మి, దాసరి పద్మ, తిరుమల, పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- ❖ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులివ్వాలి
- ❖ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరు వెంటనే ప్రారంభించాలి
- ❖ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులివ్వాలి
- ❖ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్
- ❖ సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలి
- ❖ హెచ్ యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్
- ❖ హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల నిరసన




**దశ, ఓయూ:** రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం ప్రకటించినప్పటికీ, ఆ ప్రక్రియ ముందుకు సాగటంలేదని అన్నారు.

ఇండ్ల జాగల మంజూరుకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘానికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని సీఎంను కోరారు. టి డబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హెచ్ యు జే ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డీఆర్వో నారాయణిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ రాంచందర్ మాట్లాడుతూ... నిబంధనల పేరుతో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. అర్హత ఉంటే నిబంధనలను సడలించైనా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సబ్ కమిటీ పేరుతో కాలయాపన జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన ఆర్టీసీ బస్ పాస్ లకు సంబంధించి 1/3 ఫేర్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. టోల్ చార్జీలు, సెస్ పేరుతో జర్నలిస్టులపై అదనపు భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇప్పటికే అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్ లో పని చేస్తున్న జర్నలిస్టులకు మెట్రో రైలులో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి రాజశేఖర్ మాట్లాడుతూ. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని అన్నారు. ఈనెల 15న హైదరాబాద్ లో ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డీజేఎఫ్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. హెచ్ యూజే టీడబ్ల్యూజేఎఫ్ కార్యక్రమాలకు డీజేఎఫ్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె నిరంజన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు చిట్యాల మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు బి దామోదర్, పీ సర్వేశ్వర్ రావు, ఎం రమేష్, జీ వీరేష్, ఎస్ రమేష్, బి కాలేబ్, జీ రేణయ్య, సహాయ కార్యదర్శులు ఎం జీవన్ రెడ్డి, ఎస్ మాధవరెడ్డి, పి లక్ష్మణ్ రావు, కార్యవర్గ సభ్యులు కె లలిత, పీ విజయ, టీ రాజేష్ కుమార్ , బస్వరాజు, రాజశేఖర్, వెంకట్, వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.



## పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి: సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, అఖిలభారత ఐక్య రైతు సంఘం

**దశ, భద్రాచలం:** పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనులు, ఇతర పేద రైతులకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, అటవీ శాఖ దాడులను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ, అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా గిరిజనులు, వలస ఆదివాసీలు, ఇతర పేద రైతులు సాగు చేస్తున్న పోడు భూములకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పట్టాలు అందలేదని అన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొంతమంది అటవీ శాఖ అధికారులు రైతులను భూముల నుంచి తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పోడు సాగుదారులపై అటవీ శాఖ అధికారులు దాడులు చేసి అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, గతంలో నమోదు చేసిన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, దుమ్ముగూడెం మండలాల్లో అనేక గ్రామాల్లో సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూముల్లో రైతులను బలవంతంగా తొలగించి ప్లాంటేషన్‌లు వేస్తున్నారని ఆరోపించారు. సర్వేలు నిర్వహించిన అనంతరం పట్టాలు లేవనే కారణంతో రైతుల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, కెచ్చెల కల్పన, జాటోత్ కృష్ణ, కంగాల కల్లన్న, బానోత్ ధర్మ, నాగేశ్వరరావు, వీరబాబు, రామారావు, లక్ష్మణరావు, ఆజాద్, దాసరి సాయన్న, మునిగేలా శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ డివిజన్ పరిధిలోని సైదాపూర్. శంకరపట్నం. చెల్పూర్. వావిలాల.ఇల్లంతకుంట. వీణవంక. చెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అంగాని వాడి సెంటర్లు ప్రభుత్వ ప్రైవేటు ప్రైమరీ పాఠశాలలు అప్పర్ ప్రైమరీ పాఠశాలలు హైస్కూలు జూనియర్ కాలేజీలు లలో ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను దగ్గర ఉండి నమిలిచ్చి మింగించారని హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాసు తెలియజేశారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలో 45 వేల 723 మంది పిల్లల గాను 40727 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు దగ్గర ఉండి నెమలిచ్చిమింగించారని తెలిపారు. డివిజన్లో 90 శాతం కార్యక్రమము విజయవంతం అయ్యిందని. మిగిలిన 10% ఈనెల 20వ తేదీ మా పాప కార్యక్రమంనాడు మిగిలిన పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార పార్టీ అండతో అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది :తుడుందెబ్బ



**దశ, కరకగూడెం:** ఏజెన్సీ ప్రాంతంలో అధికార పార్టీ అండదండలతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడుతున్నారని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ఏరియాల్లో రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు, పేసా చట్టం, 1/70 భూ బదలాయింపు నియంత్రణ నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు వాటిని సమర్థంగా అమలు చేయడం లేదని విమర్శించారు. పేసా గ్రామసభ అనుమతి లేకుండా సహజ వనరుల వినియోగం జరుగుతోందని, దీనిపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల హక్కులను పరిరక్షించాల్సిన వ్యవస్థ కొంతమంది ప్రభావానికి లోనై పనిచేస్తోందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు .

అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నిస్తున్న ఆదివాసీ నాయకులను బెదిరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, బెదిరింపులను సహించబోమని హెచ్చరించారు. ఇసుక రవాణా పేరుతో ఒక్కో ట్రిప్పుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు ప్రభుత్వ ఆదాయానికీ నష్టం కలిగే అవకాశం ఉందని అన్నారు. ఇసుక ఉన్న గ్రామపంచాయతీ కార్యదర్శి అనుమతి లేకుండా, మరో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎలా అనుమతులు జారీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. అసలు ఇసుక తవ్వకాల అనుమతులు ఇచ్చే అధికారం పంచాయతీ కార్యదర్శులకు ఎవరు కల్పించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, గనుల శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు వెంటనే జోక్యం చేసుకుని అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ డిమాండ్ చేసింది. అలాగే పేసా చట్టం, 1/70 చట్టం, గిరిజన హక్కుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

## డిగ్రీ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు




**దశ, హుజురాబాద్:** డిగ్రీ విద్యార్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, మొదటి సంవత్సరం నుండి విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల రిజిస్ట్రారార్ డాక్టర్ వి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం సింగాపురంలోని వి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. దీనికి ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ అధ్యక్షత వహించగా కిట్స్ రిజిస్ట్రార్ డాక్టర్ వి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని కోరారు. ఉపాధ్యాయ అవకాశాలతో పాటు ఉన్నత విద్య అవకాశాలు కూడా డిగ్రీ విద్యార్థులకు ఉన్నాయని తెలిపారు. హుజురాబాద్ ప్రాంత విద్యార్థులకు వ్యాపారాత్మక ధోరణితో కాకుండా సేవా భావంతో వి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల సేవలందిస్తోందని తెలిపారు. గతంలో కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. విద్యార్థులు సమయం వృధా చేయొద్దని, కళాశాలలో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని, క్రమశిక్షణతో మెదలాలని, యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ఇప్పటినుండి సివిల్ సర్వీసెస్ కు కూడా సన్నద్ధం కావాలని, కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లిదండ్రులకు గ్రామాలకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ఆటపాటల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐ నర్సింగ్ పోస్టింగ్‌లు వెంటనే ఇవ్వాలి: ఎంపీ ఆర్. కృష్ణయ్య



**దశ, ఓయూ:** నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో పోస్టింగ్‌ల కోసం నెలలుగా ఎదురుచూస్తున్న నర్సింగ్ అభ్యర్థులు సోమవారం ధర్నాకు దిగారు. ఎంపిక ప్రక్రియ పూర్తయి చాలాకాలం గడిచినా నియామక ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టింగ్‌ల జాప్యం వల్ల అభ్యర్థులు సీనియారిటీతో పాటు నెల రోజుల వేతనాన్ని కూడా కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగంపై నమ్మకంతో ప్రైవేట్ ఉద్యోగాలు వదిలిన పలువురు అభ్యర్థులు ప్రస్తుతం ఆర్థిక, కుటుంబ పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.పోస్టింగ్ ఎక్కడ, ఎప్పుడు ఇస్తారనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి ఆలస్యం లేకుండా పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం లోపు పోస్టింగ్‌లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఆ హామీ అమలు కాకపోతే సోమవారం నుంచి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అభ్యర్థులు హెచ్చరించారు. ఉద్యమానికి బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు కూడా మద్దతు ఇస్తాయని తెలిపారు. ఎంపికై కూడా విధుల్లో చేరలేక నిరీక్షిస్తున్న నిరుద్యోగుల పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణమే పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రాందేవ్‌తో పాటు పలువురు అభ్యర్థులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
మంగళవారం
14-07-2026
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం
వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం | ఇల్లందు | పినపాక |
భద్రాచలం | అశ్వరావుపేట



WWW.DASHANEWS.COM

# ఆరోగ్యమే మహాబలం

- ఒక్క టాబ్లెట్ తో నులిపురుగులను చంపేద్దాం...
- విద్యార్థులకు టాబ్లెట్లు అందించిన వైద్య శాఖ



**దశ, బూర్గంపాడు:** చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు అనారోగ్య సమస్యలు రాకుండా కడుపులో నులిపురుగులు చేరి కడుపు నొప్పితో బాధపడుతున్న విద్యార్థులకు ఒక్క టాబ్లెట్ తో నులిపురుగులను చంపేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ నగేష్ పిలుపునిచ్చారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా సారపాక గ్రామంలో ఉన్న ఐటిసికి సంబంధించిన పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ టాబ్లెట్లు అందించారు. అదేవిధంగా మోరంపల్లి బంజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ బర్రా సుభద్ర ఆధ్వర్యంలో వైద్యాధికారి అనిత డాక్టర్ సమక్షంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ టాబ్లెట్లను అందించారు. పలు పంచాయతీలలో ఆయా సర్పంచ్ల అధ్యక్షతన నులిపురుగుల నివారణ కోసం టాబ్లెట్లను వైద్యశాఖ విద్యార్థులకు అందజేశారు. మండల వ్యాప్తంగా సుమారు 13 వేల మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ టాబ్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు శక్తివంతంగా ఉండాలని ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు తప్పకుండా ప్రతి ఒక్కరూ నులు పురుగు నివారణ టాబ్లెట్లను వాడాలని సూచించారు. ప్రతి సంవత్సరానికి ఒకసారి వచ్చే నులిపురుగుల నివారణ దినోత్సవం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవడం మంచి ఉపయోగమని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటూ సమయానికి నిద్రపోతూ విద్యార్థులు పౌష్టిక ఆహారం స్వీకరిస్తూ చదువుకోవాలని ఆరోగ్యమే మహా బలంగా భావించి ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయకుండా సామర్థ్యంగా ఉన్నప్పుడే చదువు క్రమశిక్షణతో చదువుకోవడానికి శరీరం సహకరిస్తుందని గుర్తుపెట్టుకుని చదువులలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎమ్మెల్యే హెచ్ పీ లు, ఆశా వర్కర్లు, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చలేకనే మంత్రుల పర్యటన రద్దు

- రైతులకు సాగునీరు అందించాలి
- సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి
- బిఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి



**దశ,పినపాక :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మరిచిపోయిందని, హామీలు నెరవేర్చలేకనే ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన రద్దు చేసుకున్నారని బిఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. సోమవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలంలో సీతారామ ప్రాజెక్టు సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారని, కేసీఆర్ గారి ప్రభుత్వంలో కట్టించిన ప్రాజెక్టును సందర్శించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం 31 నెలలు గడిచినా కనీసం మట్టికూడా పోయాలేదని అన్నారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గారు ముందు సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చేందుకు పిలుపునిచ్చారని, కాని పోలీసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం పద్ధతికాదన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు హామీలు నెరవేర్చకుండా మాయమాటలు చెప్తూ సందర్శన కార్యక్రమం చేపట్టడం దారుణమన్నారు. మంత్రులు హామీలు నెరవేర్చలేక పర్యటన రద్దు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికైనా రైతులకు సంబంధించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు యాప్ పద్ధతి తీసేసి, నేరుగా ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, ముఖ్య నాయకులు దాట్ల వాసుబాబు, సొసైటీ అధ్యక్షులు రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, కొండేరురాము రాము, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కాయం శేఖర్, రాయల బాబు, చెన్నకేవులు, జి.రామకృష్ణ, బుల్లిబాబు, ఎం.నరసింహారావు, బూర సురేష్, రమేష్, ప్రవీణ్, సారమ్మ, సతీష్, కుమార్, పి.ప్రవీణ్, వెంకటరెడ్డి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణం ప్రమాదకరం.. అధ్వానంగా రాష్ట్రీయ రహదారి

**దశ, బూర్గంపాడు:** ప్రధాన వాణిజ్య, ఆధ్యాత్మికత కేంద్రాలకు కలిపే బూర్గంపాడు సారపాక మధ్య రాష్ట్రీయ రహదారి అద్వానంగా తయారై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఈ రహదారి భారీ గుంతలతో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని వాహన మిత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు భద్రాచలం, చత్తీస్గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వెళ్లే మార్గం కావడంతో వందలాది లారీలు, వాహనాలు, దిచక్ర వాహనాలు కూడా ఇట్టి రోడ్డు గుండ ప్రయాణం కొనసాగిస్తూ ఉంటాయి. ఇసుక బొగ్గు, పేపర్ అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి కోట్లల్లో ఆదాయం సమకూర్తున్నప్పటికీ రోడ్డు బలోపేతంపై దృష్టి సాధించకపోవడం చాలా బాధాకరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. 2022లో వచ్చిన గోదావరి వరదలకు ఈ రహదారి నీట మునిగి పూర్తిగా దెబ్బతింది .నాటి నుండి నేటి వరకు కనీసం మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది క్రితం తూతూ మంత్రంగా



గుంతలను పూడ్చి న కొద్ది రోజుల్లోనే తిరిగి అవే పెద్ద గుంతలగా దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. సారపాక పేపర్ బోర్డు కర్మాగానికి నిత్యం వందలాది కలప లారీలు, ట్రాక్టర్లు ఈ రాష్ట్రీయ రహదారి గుండా రాకపోకలు కొనసాగిస్తూ ఉంటాయి. కానీ పేపర్ బోర్డు యాజమాన్యం స్పందించి ఎప్పుడు కూడా రహదారికి మరమ్మత్తులు విషయంలో తమ గెస్ట్ హౌస్ లకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల దృష్టికి దృష్టికి తీసుకువెళ్లే కార్యక్రమాలు చేపట్టకపోవడం దారుణం అని ప్రజలు మండిపడుతున్నారు. ఈ ప్రాంతం నుండి నిత్యం భయం భయంగా వాహనాలని నడపాల్చి వస్తుందని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రహదారి నిర్మాణం పై పాలకులకు పట్టదు..

న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పున్నం చందు మాట్లాడుతూ బూర్గంపాడు నుండి సారపాక వరకు ఉన్న ప్రధాన రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతున్న గాయాలతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న నిర్మాణం మాత్రం పాలకులు చేపట్టకపోవడం ఈ ప్రాంత ప్రజలపై పాలకుల కి చిత్తశుద్ధి ఉందా అని ప్రశ్నిస్తున్నారు. రాత్రి వేళలో ప్రయాణం చేయాలంటే ప్రమాదం జరిగినట్లే




అన్న విధంగా రహదారి దర్శనమిస్తున్న సుమారు 5 కిలోమీటర్ల రహదారి పై నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం ప్రభుత్వ వైపల్యంగా చెప్పవచ్చు అన్నారు. భద్రాచలానికి మంత్రులు వచ్చిన మోరంపల్లి బంజర నుండి లక్ష్మీపురం ఐటిసి బిపిఎల్ నుండి తప్ప ఈ మార్గం నుండి ప్రయాణం చేస్తే ప్రమాదంగా మారిన గుంతలు దర్శనం ఇస్తాయని రూటు మార్చి భద్రాచలానికి వెళ్తారని అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారులు, పాలకులు ఇప్పటికైనా ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో రహదారులు గుంతలు మయంగా లేకుండా నూతన రహదారులుగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గడువు తరుముకొస్తుంది

- ఓటర్లకు పూర్తిస్థాయిలో అందని ఎస్ఐఆర్ ఫారాలు..
- అయోమయంలో ఓటర్లు...
- సరైన సమాధానాలు చెప్పని బిఎల్వోలు..

**దశ, బూర్గంపాడు:** ప్రత్యేక హోటల్స్ జాబితా సవరణ కార్యక్రమం ఈనెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో భూర్గంపాడుమండలంలోనిపలుచోట్లఓటర్లకుఇప్పటివరకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు అందకపోవటం ఆందోళన వ్యక్తం అవుతుంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు సమీపిస్తున్నప్పటికీ ఫారాలు అందని కారణంగా ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. గడువు తరుముకొస్తుంది మా ఫారాలు ఎక్కడ అంటూ అక్కడక్కడ కొందరు ఓటర్లు ప్రశ్నిస్తున్నప్పటికీ వారి నుండి సరైన సమాధానం రావడం లేదని ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం బూతు స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించి, అవసరమైన దరఖాస్తు ఫారాలను అందజేయడంతో ఫారాలను నింపి అందజేయాలి. కానీ కొన్ని మేజర్ పంచాయతీలు, మరికొన్ని పంచాయతీలలో అక్కడక్కడ ఇంటింటికి కొంతమంది బిఎల్వోలు వెళ్లకుండా ఒక ప్రాంతంలో కూర్చొని ఎస్ఐఆర్ ఫారాలను నింపటంతో ఓటర్లకు ఫారాలు అందనివారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు తమ వద్ద ఉన్న ఆధార్ కార్డు, ఓటర్ కార్డు పట్టుకొని బిఎల్వోలు ఉన్న ప్రాంతంలోకి వెళ్లి ఫారాలు నింపే క్రమంలో ఓటర్ల పై మండిపడుతున్నారని వాదనలను నిలబడుతున్నాయి. ఇంటింటికి తిరిగి బిఎల్వోలు ఎస్ ఐ ఆర్ ఫారాలు ఓటర్ వివరాలను నింపాల్సింది పోయి తాము ఎక్కడుంటే అక్కడికి రావాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారని వాదనలు




గట్టిగా వినపడుతున్నాయి. చదువురాని అమాయక ప్రజలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన బిఎల్వలు సరైన అడ్రస్ లేదంటూ నెట్ సెంటర్ కి ఇంటికి తిప్పుతున్నారని వాదనలు కూడా ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు అలా వచ్చి ఇలా వెళ్తూ ఉన్నారని వాదనలు కూడా వినపడుతున్నాయి. మేజర్ గ్రామపంచాయతీలలో మూడు నాలుగు పోలింగ్ బూతులున్న ప్రాంతాలలో ఎస్ ఐ ఆర్ ఫారాలు ఒక కుటుంబంలోనే నలుగురు ఉంటే ఒక్కొక్క ఫారం ఒక్కొక్క బిఎల్ఓ కి రావడం తో ఆ ప్రాంతానికి ఒక బిఎల్ఓ వచ్చి మరొకరు రాకపోవడంతో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడినట్లు వినికిడి. ఎస్ ఐ ఆర్ విషయంలో ప్రతి బిఎల్ఓ పారదర్శకంగా ప్రతి ఇంటిని సందర్శించి ఓటు విషయంలో ఒక్క ఓటు కూడా తప్పులు తడక లేకుండా పూర్తి సమాచారాన్ని నింపాల్సిన బాధ్యత ఉండగా కొంత నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. మండల అధికారులు మేజర్ గ్రామపంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించి ఇచ్చిన గడువులోపు ప్రతి ఒక్కరికి ఎస్ ఐ ఆర్ ఫారం అందజేసి వారి ఓటును పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని మండల ఓటర్లు కోరుకుంటున్నారు.



# పాము కాటుకు గురైన రాంబాబును పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు (టౌన్ ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం జగ్గారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదినేని రాంబాబు పాము కాటుకు గురై మణుగూరులోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంబాబు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రాంబాబు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఆపద ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు . ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వేముల విజయ్, సోడే వెంకటేశ్వర్లు, తాటి రాంబాబు, మాదినేని సుబ్బారావు, భూక్యా శివ, దోపాటి శ్రీను, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నల భయంతోనే డిప్యూటీ సీఎం పర్యటన రద్దు: రేగా

**దశ, మణుగూరు :** జిల్లా ప్రజలు, రైతాంగం తరఫున బీఆర్ఎస్ పార్టీ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన పర్యటనను రద్దు చేసుకున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు చేశారు.

సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు పూర్తి చేసిందని, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిలిపివేసిందని ఆరోపించారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధికి తగిన నిధులు తీసుకురాలేదని, అధికారులు రాజకీయ విభేదాల మధ్య ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సీతమ్మసాగర్ పనులు పూర్తి చేయకుండా ఇతర అంశాలపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ముందస్తు ప్రణాళిక లేదని, రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా అమలులో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జిల్లాలో మరణించిన రైతుల కుటుంబాలకు రైతు బీమా అందలేదని ఆరోపించారు. యూరియా సరఫరాలోనూ లోపాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు, వ్యవహారశైలిపై కూడా రేగా కాంతారావు విమర్శలు చేశారు. ప్రజా సమస్యలు లేవనెత్తుతున్న వారిపై బెదిరింపు ధోరణి సరికాదని అన్నారు. సింగరేణిలో బొగ్గు నిల్వల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, దీనిపై కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డుల నిర్వహణలో కూడా జాప్యం జరుగుతోందని విమర్శించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, 108 అంబులెన్స్ సేవలు తగిన స్థాయిలో లేవని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపబోమని రేగా కాంతారావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.10 లక్షల అభివృద్ధి పనులు

**దశ, మణుగూరు:** మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కల్వర్ట్, సీసీ రోడ్డు పనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం



చేస్తూ ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:** సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఇల్లందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరపున మంత్రి కిషన్ రెడ్డికి మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాలు, అభివృద్ధి అంశాలపై స్వల్పంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

